ప్రజాశక్తి
సోమవారం 05 జూన్ 2023
5
కర్నూలు



పెరిగిన భూముల విలువను తగ్గించాలి

- ప్రజాప్రతినిధులకు , అధికారులకు వినతిపత్రాలు ఇస్తాం
- స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- పిపిఎస్ఎస్ రౌండు టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పెరిగిన భూముల విలువను వెంటనే తగ్గించాలని, ప్రజా ప్రతినిధులకు , అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని అప్పటికీ స్పందించక పోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పట్టణ పౌరసంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం తీర్మానించారు. బిఎఎస్ కళ్యాణ మండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం (పిపిఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎం.నాగరాజు అధ్యక్షత వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్, రియల్ ఎస్టేట్, హోటల్స్, పెట్రోల్ బంకులు , న్యాయవాదులు వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఇ.నాగేంద్రనాథ్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నాయకులు డి.వెంకటశ్వామి, పిపిఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.నౌషాద్ మాట్లాడుతూ ప్రజలకు ముందు సమాచారం ఇవ్వకుండా ఆదాయం పెంచుకోవడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా భూముల మార్కెట్ విలువతో పాటు ఇండ్ల పన్నులు పెంచుతుందని విమర్శించారు. గతేడాది నుండి రాష్ట్ర ప్రభుత్వం భూముల, నిర్మాణాల మార్కెట్ విలువ తోపాటు యూజర్ చార్జీలు పెంచింది. ఇది చాలదన్నట్లు ఈనెల ఒకటో తేదీ నుంచి భూముల విలువ పెంచడంతో ప్రజలు భరించలేనంతగా ఇంటి పన్నులు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం భూముల మార్కెట్ విలువ పెరగడంతో ఇంటి పన్ను, నీటి పన్ను, డ్రెయినేజీ పన్ను గ్రంథాలయం పన్నులు పెరుగుతాయని, ఈ విషయం ప్రజలకు ముందుగా తెలపడం లేదన్నారు. నగరమేయర్, కార్పొరేటర్లు, శాసనసభ్యులు ఈ విషయంపై మున్సిపల్ కౌన్సిల్లో సమావేశంలో చర్చకు పెట్టకపోవడం బాధాకరమన్నారు. కార్పొరేటర్లకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చి వారు స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు బాలసుబ్రమణ్యం, పెట్రోల్ బంకుల ఓనర్ అసోసియేషన్ నుండి జక్కం సురేష్ హోటల్స్ రంగం నుండి జి.అబ్బాస్ అలీఖాన్, రియల్ ఎస్టేట్ రంగం నుండి జయన్న, కాలనీల అసోసియేషన్నుండి కె.రంగస్వామి, ఎస్.రమణ గౌడ్, అబ్దుల్ ఖయూంబాష, కె.రామాంజనేయులు, కన్నా దేశాయ్, కె.విష్ణు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.నౌషాద్

ఘనంగా ఏరువాక పౌర్ణమి

- ఎద్దుల ఊరేగింపు తిలకించిన రైతులు, మహిళలు
- హోళగుందలో విస్తారంగా వర్షం - పత్తిసాగులో నిమగ్నమైన రైతులు

ప్రజాశక్తి -హోళగుంద

'కల్లా కపటం కానని వాడ లోకం పోకడ తెలియని వాడ, ఏరువాక సాగారో రన్నో చిన్నన్న నీ కష్టమంత తీరునురో రన్నో చిన్నన్న...నవ ధ్యానాలను గంపకెత్తుకొని, చద్ది అన్నము మూట గట్టుకొని, ముళ్ల గర్రను చేతబట్టుకొని ఇల్లాలునీ వెంటబెట్టుకొని.... ఏరువాక సాగారో రన్నో చిన్నన్న నీ కష్ట మంత తీరునురో రన్నో చిన్నన్న' అని కొసరాజు సినిమా పాట రాసినట్లుగా కర్ణాటక రాష్ట్రం సరిహద్దు మండలం హోళగుందలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించుకున్నారు. హోళగుంద మండలంలో విస్తారంగా వర్షం కురవడంతో రైతులంతా ఆదివారం ఉదయం నుంచే వ్యవసాయ పనులలో నిమగ్నమై కనిపిచారు. పత్తివిత్తనాలకు అత్యధిక విస్తీరణంలో విత్తారు. సాయంత్రం సామూహికంగా ఎద్దులను ఊరేగింపునకు వదిలారు. రైతులు మహిళలు అక్కడికి చేరుకొని తిలకించి ఆనందంలో మునిగిపోయారు. ఏరువాక పౌర్ణమి కర్ణాటక సంప్రదాయమనే చెప్పాలి. ఆంధ్ర తెలంగాణలో కన్నా కర్ణాటకలో పెద్ద పండగల జరుపుకుంటారు. ఈ పౌర్ణమి యొక్క ముఖ్య ఉద్దేశం తమ పొలాలను దుక్కి దున్నుకొని వ్యవసాయానికి సిద్ధమైనామనే సాంకేతాన్ని సూచిస్తుంది. రైతులు తమ ఎద్దులను శుభ్రపరచి పండుగలో అందరిని ఆకట్టుకునేలా అలంకరిస్తారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో ఊరేగింపులో గెలుపొందిన ఎద్దులను పురవీధుల గుండా మెరవని చేసి ఊరేగించారు. ఊరేగింపు కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు ఎస్ఐ శ్రీనివాస ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏరు వాక పౌర్ణమి గురించి : వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు రైతులందరూ తమ పొలాల్లో భూమి పూజను చేస్తారు. ఇది అనాది కాలం నుంచి వస్తున్న ఆచారం. ఈ సమయంలో తమ పొలాల్లో ఎద్దులతో నాగలితో దుక్కి దున్నడాన్ని 'ఏరువాక' అంటారు. ఏరు అంటే ఎద్దులను కట్టి దున్నడానికి ఆరంభమని చెబుతారు. తరువాయి 6లో..


హోళగుంద: ఎద్దుల ఊరేగింపు తిలకించిన రైతులు, మహిళలు

ఆస్తి, నీటి పన్నుల వసూలులో రెండో స్థానం

- ఆస్తి పన్ను రూ.72 కోట్ల 17 లక్షలు -నీటి పన్ను రూ.1048 లక్షలు
- షాపింగ్ కాంప్లెక్సుల అద్దెల ద్వారా రూ. 4 కోట్ల 87 లక్షలు
- ప్రజాశక్తితో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరపాలక సంస్థ 2022-23 సంవత్సరంలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. కార్యాలయ సిబ్బంది కృషి, మార్చి నెలలో ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇవ్వడం, పాత్రికేయులు ఇచ్చిన ప్రచారం తదితరాల వలన నగరపాలక సంస్థ ద్వారా విస్తృత చేయగలిగాం. అందుకు ప్రజలు బాగా స్పందించి , సహకరించి పన్నులు చెల్లించారు' అని కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఎసి) పివి రామలింగేశ్వర్ చెప్పారు.ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో అనేక విషయాలను వెల్లడించారు.

2022 -23 ఆర్థికసంవత్సరం ఆస్తి పన్ను డిమాండ్ ఎంత? ఎంత వసూలు అయింది?

ఎసి: 2022-23 సంవత్సరం ఆస్తి పన్ను రూ.87.42 కోట్లు డిమాండ్ కాగా మార్చి నెలలో ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇచ్చింది. దీంతో రూ.72.17 కోట్లు వసూలు అయింది.

అందులో నీటి పన్ను ఎంత వసూలు అయింది?

ఎసి: కర్నూలు నగరంలో నీటి పన్ను రూ. 2271 లక్షలు డిమాండ్ కాగా రూ.1048 లక్షల వసూలు అయ్యింది. ఇంకా 1223 లక్షలు బకాయి ఉంది.

కర్నూల్ నగరపాలక సంస్థ పరిధిలోఎన్ని షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్నాయి?, షాపింగ్ కాంప్లెక్స్ లలో ఉన్న షాపుల అద్దెల ద్వారా ఎంత ఆదాయం వచ్చింది?

ఎసి: కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో 18 షాపింగ్ కాంప్లెక్స్ లు ఉన్నాయి. అందులో ఉండే షాపుల ద్వారా రూ.4.87 లక్షలు ఆదాయం వచ్చింది. కోర్టులో 100 షాపుల అద్దెలకు సంబంధించి కోర్టులో ఉండడం చేత పెండింగ్లో ఉన్నాయి. పూర్తిగా 30 షాపుల అద్దెలు చెల్లించినవి ఉన్నాయి.

ఎగ్జిబిషన్ గ్రౌండ్ 60 రోజులకు వేలంపాడడంతో ఎంత ఆదాయం వచ్చింది?

ఎసి: ఎగ్జిబిషన్ గ్రౌండ్ 60 రోజులకు రోజుకు రూ.35 లక్షల చొప్పున వేలంపాడారు. వేలం పాడిన వ్యక్తి డబ్బులు చెల్లిస్తారు.

నగరంలో ఖాళీ స్థలాల ద్వారా పన్నులు ఎంత వసూలు అయ్యాయి?

ఎసి: నగరంలో ఖాళీ స్థలాల ద్వారా రూ. 14 కోట్ల 27 లక్షలు డిమాండ్ కాగా అందులో రూ.489 లక్షలు వసూలు అయ్యాయి. ఇంకా రూ. 937 లక్షలు బకాయి ఉంది. అందరికీ నోటీసులు పంపాం. నోటీసులు అందినవారు వచ్చి పన్నులు చెల్లిస్తున్నారు. చెల్లించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ఆస్తి పన్నులో గ్రంథాలయం పన్ను ఎంత శాతం వసూలు చేస్తారు?

ఎసి: ఆస్తి పన్నులు గ్రంథాలయం పన్ను ఎనిమిది శాతం వసూలు చేస్తాం. జిల్లా గ్రంథాలయానికి ఎలాంటి బకాయి లేకుండా ఈ సంవత్సరం రూ. నాలుగు కోట్లు చెల్లించారు.

మార్కెట్, మటన్, బీఫ్, ఫిష్, సైకిల్ స్టాండ్ల ద్వారా ఎంత ఆదాయం వచ్చింది?

ఎసి: మార్కెట్, మటన్, గొర్రెలు, బీఫ్, ఫిష్, సైకిల్ స్టాండ్ల ద్వారా రూ.22,13,000 ఆదాయం వచ్చింది. అయితే గొర్రెలు ,ఎద్దుల వధ శాలలు కోర్టులో ఉండడం చేత వాటిని మూసేశాం.

నగరపాలక సంస్థల ఎంతమంది రెవెన్యూ సిబ్బంది ఉన్నారు?

ఎసి: నగర పాలక సంస్థలో ఇద్దరు రెవిన్యూ ఆఫీసర్లు, ఏడుగురు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ సెక్షన్లో 19 మంది క్లర్కులు, సచివాలయాల్లో 115 మంది అడ్మిన్ సెక్రటరీలు పనిచేస్తున్నారు. అందరి సహాయ సహకారాలతో నిరంతరం పన్నులు వసూలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్సులకు అణువుగా ఉండే ప్రదేశాలను గుర్తించి షాపుల నిర్మాణం చేసి నగరపాలక సంస్థకు ఆదాయాన్ని సమకూర్చే విధంగా కృషి చేస్తున్నాం. నగరంలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించే విధంగా ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నాం.



మార్క్సిస్టు ముద్రవేసిన కథకుడు కేతు

కేతు విశ్వనాథరెడ్డి సంతాపసభలో వక్తలు


కేతు విశ్వనాథరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ప్రగతిశీల సాహిత్యసంఘాల ఐక్యవేదిక నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఆధునిక కథాసాహిత్యంలో తొలితరం కథకుల్లో ఉన్న కేతు విశ్వనాథరెడ్డి అరవైఏళ్ళ సాహిత్యజీవితంలో తన రచనల్లో మార్క్సిస్ట్ ముద్రవేశారని, అనేక కథలు సామాజిక వాస్తవికతతో రాశారని ప్రగతిశీల కథకుడుగా రచనలు చేశారని వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని లలితకళాసమితిలో ప్రగతిశీల సాహిత్యసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కేతువిశ్వనాథరెడ్డి సంతాపసభ కవి కెంగార మోహన్ సభాధ్యక్షతన నిర్వహించారు. విరసం నాయకులు పాణి మాట్లాడుతూ కథాసాహిత్యంలో అనావృష్టి, ఫ్యాక్షన్ , దళితసమస్యలు, స్త్రీవేదనలు కథలుగా రాశారని ఇందులో మార్పునకు అవకాశమున్న శక్తులను అన్వేషించారన్నారు. రాయలసీమలో ప్రగతిశీల సాహిత్య పరిణామ వికాసాన్ని పరిశీలించినపుడు కేతు సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సి వుందన్నారు. వ్యవసాయకుటుంబాల్లో ఆధునికత ప్రవేశం చూశాడన్నారు. కథలల్లో సామాజికత ఉండటం వల్ల కథలు సాహిత్య సమాజంలో ఆసక్తిని రేకెత్తించాయన్నారు. తెలుగుకథల్లో కొత్త ఒరవడులను పట్టుకున్నాడన్నారు. సామాజిక పరిణామాలను అంగీకరిస్తూ రచనలు చేశాడన్నారు. జి.వెంకటకష్ణ మాట్లాడుతూ కక్షలు, కరవు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులూ జీవన వైవిధ్యం లాంటి అంశాల్ని విశ్లేషిస్తూ సీమ నుంచి విస్తృతమైన సాహిత్యం వెలువడగా అందులో ప్రధానపాత్ర పోషించిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. సభాధ్యక్షులు కెంగారమోహన్ మాట్లాడుతూ మార్క్సిస్ట్ కథకుడి ఆచరణాత్మక సాహిత్యజీవితమని దాదాపు ఆరున్నర దశాబ్దాల క్రితమే అంటే 1958లోనే సామాజిక అవగాహనతో, స్పృహతో చైతన్యంతో కథను రాసిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డిఅన్నారు. బహుశా ఇప్పుడున్న కథకులకు అందనంత ఎత్తులో నిల్చుని ఉండి కూడా తనంత ఎత్తుకు ఎదగమని కాకుండా తనతో పాటు కలసి నడవాలని, అందరం కలసి అసమానతలు అంతరాలు, ఎత్తుపల్లాలులేని సరికొత్త సమాజాన్ని నిర్మిద్దామని సాహిత్యకారులను పిలిచిన కథకుడు కేతు అన్నారు. ఇనాయతుల్లా మాట్లాడుతూ అరవైఏళ్ళ కేతు సాహిత్య జీవితంలో తనశక్తి మేరకు సౌందర్యాన్ని ఆరాధించాడన్నారు. లోకంలో మంచితనాన్ని నమ్మాడని సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అనివిశ్వాసిగా జీవించాడన్నారు. తను కవితాత్మక భాష పరిశీలించినపుడు "అందమైన సాయంకాలాలంటే నాకెంతో యిష్టం యౌవన సౌందర్యాన్ని గుర్తుకు తెచ్చే పూలంటే నాకు ప్రాణం. ప్రకృతిలోని యింకా యెన్నో నన్ను యిప్పటికీ పరవశింపజేస్తాయి. మనుషుల్లోని మంచితనం పట్ల నాకు అపారమైన విశ్వాసం వుంది. స్నేహమంటే యిప్పటికీ పడిచస్తాను." అన్న భావుకత వాఖ్యాలు కనబడతాయన్నారు. డా.హరికిషన్ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి కథల్లో కవిత్వభాష ప్రత్యేకతని అదొక్కటే అనడానికి వీల్లేదని విరివిగా సామెతలు నుడికారాలు కథల్లో వాడరన్నారు. 1983లో అన్నదాతలు అనే కథ రాశారని ఆ కథ ప్రారంభ వాక్యాలే సామెతలతో ప్రారంభిస్తారన్నారు. ఆనాటి పరిస్థితులలోని సామాజిక అంతరాలను చెరిపేస్తూ ఒక యువకుడు చేసిన జీవన పోరాటం కథావస్తువుతో కథను రాశాడని, కథలోని పాత్రలు సహజత్వాన్ని కలిగి ఉండేలా శిల్పించారన్నారు. కులాంతర వివాహం చేసుకున్న యువకుడికి తనజీవితంలో జరిగే అనేక ఆటుపోట్లను కళ్ళకు కట్టినట్లు చెప్పిస్తాడన్నారు. కేతు కథల్లో జీవం ఉంటుందని వాస్తవమైన జీవితాలు కనబడ్తాయన్నారు. సభకు ముందు కవులు కేతు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లర్పించారు. సభలో కథకులు జి.ఉమామహేశ్వర్ , ఎస్డివి అజీజ్ , మారుతిపౌరోహితం, కవులు చౌశా, టి.వెంకటేష్ ,రాంచంద్ , సయ్యద్ జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు కోల్స్ మెమోరియల్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

'కోల్స్ మెమోరియల్ ' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కోల్స్మెమోరియర్ జూనియర్ శాశాల 1994-96 బ్యాచుకు సంబంధించిన పూర్వ విద్యార్థులు కర్నూలు కోట్ల విజయభాస్కర్ రెడ్డి మెమోరియల్ ఘాట్ లోని ఫన్ అండ్ ఫుడ్ కోర్టులో ఆదివారం సమేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి దశలో ఉన్నప్పుడు తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దాదాపు 29 సంవత్సరాల అనుభవాలను పంచుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అందరూ కలవడం కోల్స్ కాలేజీ విద్యార్థులు వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొందరి ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు ఉమాకాంత్, సంపత్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి సమ్మేళనాలు మానసిక ప్రశాంతతకు దోహదపడుతాయని జి.మల్లికార్జునరావు , మంజువాణి, మల్లీశ్వరి, సునీత, నిర్మల, కృష్ణప్రసాద్ తదితరుల మాట్లాడుతూ చెప్పారు.



రైతు సంక్షేమానికి కృషి : గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం ఏరువాక పున్నమి సందర్భంగా కల్లూరు మండలం కె.మార్కాపురంలో ఆమె రైతులతో మాట్లాడారు. రైతులందరికీ ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. రైతులందరు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. టిడిపి మండల అధ్యక్షుడు డి.రామాం జనేయులు, నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణపల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్యాదవ్, సల్కపురం దేవేందర్ రెడ్డి,పెద్ద కొట్టాల రంగారెడ్డి, పాండు నాయుడు పాల్గొన్నారు. గ్రామంలోని రైతన్నలతో మాట్లాడుతూ రైతులు సంతోషంతోనే దేశం సుభిక్షంగా వుంటుందని, రైతన్నలు ఏరువాక పౌర్ణమిని ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధాప్యం శాపం కారాదు

ప్రముఖ వైద్యులు శంకర్శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపం కారాదని, వృద్ధాప్యంలో ఉన్న వారిని సముచితంగా గుర్తించి గౌరవం ఇవ్వాలని ప్రముఖ వైద్యులు శంకర్ శర్మ సూచించారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ ఆదివారం కర్నూలు బి క్యాంపు లోని మన వృద్ధుల ఆశ్రమంలో నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రపంచీకరణ నూతన ఆర్థిక సామాజిక అంశాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చిన్నా భిన్నం చేశాయన్నారు. వృద్ధాప్య తల్లిదండ్రుల సంక్షేమాన్ని తమ బాధ్యతగా భావించి సముచితంగా గుర్తించి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. నేటి ఆధునిక నాగరికత వృద్ధుల పట్ల విభిన్న రేఖ గీసిందని అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ట మైన చట్టాలను రూపొందించి వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టంను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు వచ్చే సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మన దేశ నాగరికత మార్పు చెందడం వల్ల ఉమ్మడి కుటుంబంలో విభేదాలు రావడం వల్ల చిన్నా భిన్నం కావడానికి దారితీస్తున్నాయని చెప్పారు. తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపంగా మారకుండా చూడవలసిన బాధ్యత వారి పిల్లలదేనన్నారు. అనేక కారణాల వలన వృద్ధాశ్రమంలో ఉన్న వారికి స్తోమత ఉన్న ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ శంకర్శర్మ

శిథిలమైన ఓవర్ హెడ్ ట్యాంకు

కూల్చడంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ మండలంకంభదహాల్ ఎస్సి కాలనిలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకొంది. ఇక్కడే పెచ్చులూడి కిందకు పడుతుండటంతో సమీపంలోనీ నిర్వాషితులు భయం భయంగా జీవిస్తున్నారు. ఆ ట్యాంకు పని చేయక సుమారు అరేళ్లు అవుతోందని, అయినా ట్యాంకు పైబాగంలో పైప్ కట్ చేసి కింద పైప్ గుండా పైపులు సరఫరా చేయడం అంతర్యమేమిటోనని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉందని ప్రమాదం జరగక ముందే కూల్చివేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరారు.



బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి-పత్తికొండ


రేజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ ను వెంటనే అరెస్టు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండ పట్టణంలో నాలుగు స్తంభాల దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, నాయకులు మోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంలో బిజెపి నాయకులు మహిళలపై అకృత్యాలకు పాల్పడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రేజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ డబ్ల్యూఎఫ్ఐ కమిటీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న రేజర్లకు పై పోలీసులు లాఠీ చార్జి చేసి జైలుకు తీసుకెళ్లడమేంటని ప్రశ్నించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదయినందున ఎంపీని వెంటనే అరెస్టు చేయాలన్నారను. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు హరి ,అహ్మద్, దస్తగిరి, ఇమ్రాన్, ముస్తఫా, ఇలియాస్, ఇస్మాయిల్, నిషార్, రమేష్, షాకీర్, రసూల్, రవి పాల్గొన్నారు.



పత్తికొండలో నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు ఎంపిడిఓగా అజామ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు మండల ఎంపిడిఒగా అజామ్ ఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన ఆదివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1989లో గూడూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్గా నియామకమయ్యారు. గూడూరు ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా సేవలందించారు. ఆపై జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించారు . 2020లో ఎంపిడిఒ గా పదోన్నతి పై వైఎస్ఆర్ కడప జిల్లా గోపవరం మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం కర్నూలు మండలం అవుకు మండలానికి ఎంపిడిఒగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం కర్నూలు ఎంపిడిఒగా సాధారణ బదిలీపై వచ్చారు.


ఉప్పర్లపల్లిలో మురుగునీరుతో చెరువును తలపిస్తున్న రోడ్డు

గ్రామాలలో లోపించిన పారిశుధ్యం...

ప్రజాశక్తి-తుగ్గలి

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కాలువలో నున్న చెత్త, చెదారం రోడ్లు లోకి వచ్చి రోగాలకు కారణం అవుతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో కాలవల లో ఉన్న నీరు రోడ్ల మీదకు వచ్చి దుర్వాసన వస్తుందన్నారు. పలుమార్లు గ్రామపంచాయతీకి తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు స్పందించడం లేదన్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో చెత్తాచెదారం అంతా రోడ్లమీద ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి ఉప్పర్లపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు వివిధ రోగాలకు గురికాకుండా చూడాలని ఆయన కోరారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


నాగలి దున్నిన మీనాక్షి నాయుడు


ఏరువాకలో వేడుకల్లో రామ్మోహన్ రెడ్డి


ఏరువాకు పౌర్ణమి వేడుకల్లో పాలకుర్తి దివాకర్ రెడ్డి

5వ పేజీ తరువాయి.. ఈ వేడుకను శాస్త్ర పరంగా ప్రారంభిస్తారు. అంటే ఈ పర్వదినాన వ్యవసాయ పనులు ప్రారంభించడం అని అర్థం. ఈ సందర్భంగా ఏరువాక పున్నమి రోజునే వ్యవసాయ పనులను ఎందుకు ప్రారంభిస్తారు.. జ్యేష్ఠ నక్షత్రం వేళ నాగలి సారించి పనులు ప్రారంభించడానికి మంచి రోజుగా భావిస్తారు. అందుకే వర్షరుతువు ప్రారంభం కాగానే, రైతులు ఉదయమే ఎడ్లను శుభ్రం చేసి, వాటి కొమ్ములకు రంగులు పూసి గజ్జెలు, పూలతో అలంకరించి కట్టేకాడిని ధూప దీప నైవేద్యాలతో పూజిస్తారు. అనంతరం కాడెద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి బొబ్బట్లు తినిపిస్తారు. పొలానికి వెళ్లి భూమాతకు ఆరాధిస్తారు. అలాగే ఏరువాక పున్నమి రోజున సాయంకాలం వేళ రంగు రంగుల బట్టలతో ఎడ్లను అలంకరించి, డప్పులు, మేళతాళాలతో ఊరేగిస్తారు. అనంతరం ఎడ్లు అంటు రోగాల బారిన పడకుండా వాటికి ఆయుర్వేద మందులను, నూనెలను తాగిస్తారు. **ఆదోని :** మండలంలోని బైచిగేరి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు గుంటుకను చేతబట్టి దుక్కి దున్ని ఆనందోత్సవాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. మహా నాడులో ప్రక టించిన మేనిఫెస్టోకర ప్రతాలను గ్రామంలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి పెద్దపీట వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు భూపతి నాయుడు, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, రంగస్వామి నాయుడు, బాబు నాయుడు, రంగన్న, బుద్ధారెడ్డి, శివప్ప, తిమ్మప్ప, అయ్యన్న, శేషి రెడ్డి, బసవరాజు, విశ్వనాథ్ గౌడ్, లోకనాథ్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రవి, జై రామ్, ప్రహల్లాద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మంత్రాలయం : ఎద్దుల ఊరేగింపు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. రైతులు తమ ఇళ్లలోనే కాడెద్దులను మంచినీళ్ళతో శుభ్రం కడిగి, కొమ్మలను రంగులు వేసి పూలతో అలంకరించి, కాడెద్దులను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. గ్రామచావిడి వరకు కాడెద్దుల ఊరేగించి సంబరాలు చేశారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండుతాయని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. **ఏరువాకలో వేడుకల్లో రామ్మోహన్ రెడ్డి ..**

పెద్దకడబూరు గ్రామ శివారులలోని పొలాలో ఆదివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి నాగలి పట్టి దుక్కిదున్నారు. ఈ సందర్భంగా పెద్దకడబూరు మండల ప్రజలకు రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు ఆశించిన వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు.

మంత్రాలయం : మండల కేంద్రమైన పాతవూరులోని సంత మార్కెట్‌లో ఏరువాక పౌర్ణమి సంబరాలను గ్రామస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఏరువాక సంబరాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ఎమ్మిగనూరు డిఎస్పీ సీతారామయ్య నిఘా మధ్య సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ఆనంద్ రెడ్డి ఇతర పోలీస్ సిబ్బందితో బందోబ స్తు ఏర్పాటు చేశారు. నిర్వహించిన ఎద్దుల పరుగు పందెంలో కురువ నర్సిరెడ్డి ఎద్దు గెలిచి ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. వేడుకలు విజయవంతం కావడంతో సహకరించిన వారికి సర్పంచ్ భీమయ్య ధన్యవాదములు తెలిపారు.

ఏరువాకు పౌర్ణమి వేడుకల్లో పాలకుర్తి దివాకర్ రెడ్డి

రైతుల కళ్లలో ఆనందం చూడడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో జరిగిన ఏరువాకు పౌర్ణమి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు ఏరువాక పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగలి పట్టి పోలం దున్ని రైతులకు మంచి జరగాలని మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు. తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన స్వామి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, క్లస్టర్ ఇన్ చార్జ్ చావిడి వెంకటేష్,నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు మాధవరం అమర్నాత్ రెడ్డి, వగరూరు అబ్దుల్ సాబ్,పవన్ కూమర్ రెడ్డి,రాగన్న, రోగప్ప, మాలపల్లి భీమన్న ఆచారి, చంద్ర,వీరేష్,లక్ష్మన్న,లక్ష్మారి జెట్టి వీరేష్,తెలుగు యువత రాజశేఖర్,అంజి తదితరులు పాల్గొన్నారు. **హోళగుంద:** మండలంలో రైతులు కార్మికులు ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించుకున్నారు సాయంత్రం సామూహికంగా ఎద్దులను ఊరేగింపు వదిలారు. రైతులు, మహిళలు అక్కడికి చేరుకొని తిలకించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన దళితులు

ప్రజాశక్తి-పెద్దకడబూరు


పోలీస్ స్టేషన్‌లో దళిత మహిళలు

మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో అగ్రవర్ణాల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం అర్ధరాత్రి బసలదొడ్డి దళితులు పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. శాంతియుతంగా బసలదొడ్డి గ్రామంలో జరుపుకున్న పెళ్లి ఊరేగింపును కొందరు అగ్రవర్గాల యువకులు ఆడుకుని తమ ఇళ్ళ ముందు ఊరేగింపు రాకూడదని గొడవకు దిగారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నిర్మించిన దుకాణాలను ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు


మాట్లాడుతున్న పి ఎస్. రాధాకృష్ణ

ఆలూరు పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన దుకాణాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ అన్నారు. ఆదివారం జ్యోతిబసు భవన్‌లో పార్టీ మండల కమిటి సమావేశం మైనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలూరు మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ స్థలంలో దాదాపు కోటి 20 లక్షల రూపాయలతో 27 దుకాణాల నిర్మాణం, ఎంపిడిఒ ఆఫీసు ముందు దాదాపు 80 లక్షల రూపాయలతో 18 దుకాణాలు నిర్మాణం పూర్తి చేసి ఏళ్ళు గడుస్తున్నా అధికారులకు,నాయకులకు ఏమి పట్టనట్లు వ్యవహ రించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షాపులను ఎంపిడిఓ ఆఫీస్ ముందు ఉన్న షాపుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజలచేత ప్రారంభింపజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ షాకీర్, పార్టీ సీనీయర్ నాయకులు కె పి.నారాయణ స్వామి, నాయకులు తిమ్మప్ప,నాగరాజులు,గోవర్ధన్ పాల్గొ న్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని నేలతలమర్రి గ్రామంలో చర్చి నిర్మాణం కోసం మండల టిడిపి కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ రూ. 40000 ఆర్థిక సాయం ఆదివారం అందించారు. ఆ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ కాలనీ పెద్దలు,యువకులు చర్చి నిర్మాణానికి సాయం చేయాలని అడుగగా విజయభాస్కర్ గౌడ్ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమములో సర్పంచ్ నాగరాజు గౌడ్, పెద్దగొల్ల వెంకటేష్, పాస్టర్ జాన్సన్, రంగన్న, సుకలి, రంగస్వామి, నారాయణ,దినకర్,ప్రసాద్,రామచంద్ర పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని గుడికల్లు రోడ్డులో ఉన్న శ్రీ మల్లికార్జున ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచితంగా నిర్వహించిన న్యూరోపతి టెస్ట్, బీఎండీ టెస్ట్ పరీక్షల వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. ఆర్థో వైద్యులు సి. మల్లికార్జున రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకలు, నరాల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ నరసింహులు, ఆపిల్ ల్యాబ్ అధినేత భీరప్ప, ఫిజియో థెరపిస్ట్ శ్రీదేవి, హాస్పిటల్ సిబ్బంది రాఘవ, వినోద్, యువరాజ్, లత, రజిత, మేరీ, సరోజ, దీవెన, మౌనిక పాల్గొన్నారు.

నందవరం ఎంపిడిఒగా దశరథ రామయ్య

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా దశరథ రామయ్య నియమితులయ్యారు. గత 4నెలలుగా ఎంపిడిఓ రాణెమ్మ విధులకు హాజరు కాక పోవడంతో ఏవో కృష్ణమూర్తికి ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఉండడంతో మిడుతూరు ఎంపిడిఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) గా పని చేస్తున్న దశరథ రామయ్యకు పదోన్నతి రావడంతో ఆయనను నందవరం మండల ఎంపిడిఓగా ఉన్నతాధికారులు నియమించారు. ఆయన 2రోజుల్లో ఎంపిడిఒగా బాధ్యతలు చేపడతారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఇష్టానుసారంగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - హాలహర్వి



అక్రమార్కులకు ఇసుక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఆంధ్ర - కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని వేదవతి ఇతర వాగులు, వంకల నుంచి దాదాపు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో.. అనుమతులు లేకుండానే ఇసుక తరలిపోతోంది. సంబంధిత అధికారులు అక్రమ రవాణాను 'మామూలు'గా వదిలేస్తుం డటంతో అక్రమార్కులు రూ. లక్షలు వెనకేసుకుంటున్నారు. దీంతోపాటు పలువురు గుత్తేదార్లు అభివృద్ధి పనుల పేరిట అనుమతి తీసుకొని ఇష్టారాజ్యంగా రవాణా చేస్తున్నారు. ఉదయం, రాత్రివేళల్లో తరలిస్తూ నిబంధనలకు పాతరేస్తు న్నారు. జిల్లాలోని హాలహర్వి,ఆలూరు, హొలగుంద మండలా ల్లోని పెద్దవాగు తదితర నీటి వనరులున్నాయి. ప్రధాన రహదారికి అనుకూలంగా ఉన్న ఈ వనరులు, కర్ణాటక సరిహద్దులోని వాగుల నుంచి ఈ తతంగం సాగుతోంది. కర్ణాటకలోని బళ్ళారి,మోకా, హగరి,ఆంధ్రలోని చింతకుంట, క్కొకరచేడు, గూల్యం ,బల్లురు పలువురు దళారులు స్థానిక దళారులతో కుమ్మక్కై ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. **జగనన్న ఇళ్ల పేరిట:** వాగుల నుంచి అభివృద్ధి, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పేరిట ఇసుక గుత్తేదారులకు రెవెన్యూ అధికారులు రోజుకు ఒక్క ట్రాక్టరు నాలుగు ట్రిప్పుల ఇసుకను రవాణా చేసేందుకు అనుమతినిస్తారు. ఈ అనుమతి ఆధారంగా పలువురు గుత్తేదారులు అభివృద్ధి పనులతో పాటు, ప్రైవేటు భవన నిర్మాణాలకు వేకువజా మున, రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. మండలంలోని వివిధ వాగుల నుంచి రోజుకు దాదాపు పదుల సంఖ్యలో, ట్రాక్టర్లతో తరలిపోతున్నట్లు సమాచారం. ఒక్క ట్రాక్టరు ఇసుకకు గుత్తేదారులు రూ.2000 నుంచి రూ.5000 వసూలు చేస్తున్నారు. దీన్ని బట్టి పరిశీలిస్తే నెలకు దాదాపు రూ. లక్షల్లో రవాణా జరుగుతోంది. ఉద్యోగుల సెలవు దినాలు, అర్ధరాత్రి, వేకువజామునే ఎక్కువగా వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. భవనాలకు గుత్తేదార్లు రాత్రివేళల్లోనే రవాణా చేస్తుంటారు. ఉదయం అభివృద్ధి పనుల పేరిట రవాణా చేస్తుండగా, రాత్రి వేళల్లో అక్రమంగా విక్రయాలు జరుపుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అడపాదడపా తనిఖీలు చేస్తే ఎలాంటి రసీదులు లేకపోవడంతో జరిమానాలు విధించి వదిలివేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

- విజయ్ కుమార్, ఎస్ఐ హాలహర్వి

అభివృద్ధి పనులకు అనుమతుల మేరకు ఇసుకను రవాణా చేయాలే తప్ప అక్రమంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలా అక్రమంగా తరలిస్తున్న పలువురిపై జరిమానాలు విధించాం.

చర్మకార వృత్తిదారుల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణం పరిధిలో కలుబావిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చర్మకారుల వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను కెవిపిఎస్ సీనియర్ నాయకులు పిఎస్ గోపాల్,జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప,పట్టణ కార్యదర్శి నాగరాజ్ విడుదల చేసి అనంతరం వారు మాట్లాడారు. సచ్చిన పశువుల చర్మంతో వస్తువులు సృష్టించిన, తొలి శాస్త్రవేత్తలైన చర్మకార వృత్తిదారుల బ్రతుకు భద్రత కోసం ఉద్యమిద్దరం రండి అని ఈనెల 24వ తేదీన ఎమ్మిగనూరులో చర్మకార వృత్తిదారుల జిల్లా ప్రథమ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మిగనూరులో మూతపడ్డ లెదర్ ఫ్యాక్టరీని తెరిపించి, కర్నూల్లో మరో లెదర్ ఫ్యాక్టరిని ఏర్పాటు చేసి ఉపాధి చూపాలని, చెప్పులు కుట్టే చర్మకారు లకు వృత్తి నిర్వాణకై ప్రభుత్వమే షాపులు కొని ఇవ్వాలని, పెన్షన్ నెలకు 5000 రూపాయలకు పెంచాలని, పెన్షన్ ఆన్లైన్ దరఖాస్తుకు ఉన్న ఆటంకాలను తొలగించి, సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగానే నమోదు చేయించు కోవాలని, చర్మ కారులందరికి ప్రభుత్వమే ఉచితంగా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌఖ్యార్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పట్టణ నాయకులు కృష్ణమూర్తి, మల్లికార్జున,వీరేశ్, వెంకటేష్, సుందరయ్య పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

నత్తనడకన.. ఎస్ఎస్ ట్యాంక్ పనులు

నాణ్యత డొల్ల

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మండలం పరిధిలో చిన్నహరివణం, సంతేకూడ్లూరు మధ్యలో 6 కోట్ల రూపాయల వ్యాయంతో నూతన ఎస్ఎస్ ట్యాంక్ పనులకు రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. గత రెండేళ్లుగా నత్త నడకతో పనులతో నాణ్యత పాటించకుండా పనులు సాగిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం అయిన పనులలో నాణ్యత ఎక్కడ కనిపించడం లేదని, వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మదిరే, సంతేకూడ్లూరు, పెద్దహరివణం గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఉద్దేశంతో ఈఎస్ఎస్ ట్యాంక్ పనులు చేపట్టినప్పటికీ పనులు ఏమాత్రం నాణ్యత కళ్లకు కొట్టిచ్చినట్టుగా కనిపిస్తోంది. ఎస్ఎస్ ట్యాంక్ చుట్టూ బండలు పరచడానికి ఒక చెదురు 400 రూపాయలు ఇచ్చి బండలు పరిచినప్పటికీ అవి హెచ్చుతగ్గుల వల్ల, క్యూరింగ్ వల్ల, నాణ్యత కనిపిం చడం లేదని ఇటీవల కాలంలో చెరువు పనులను పరిశీలించిన కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప,సంతేకూడ్లూరు కెవిపిఎస్ గ్రామ కమిటీ కార్యదర్శి పరమేష్ తీవ్రంగా ఆరోపించారు. క్యూరింగ్ లేక సిమెంట్ నిలవడం లేదని చిన్నపాటి వర్షానికే బండలు కంగిపోతున్నాయని అన్నారు.ఇలా నాణ్యతలేని పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చిత్రలేఖనం పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - దేవనకొండ

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు దేవనకొండ శాఖ గ్రంథాలయ అధికారి ఏ. అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో విజేతగా నిలిచిన విద్యార్థులకు వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున బహుమ తులు ప్రధానం చేశారు. మండల కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ పోటీ పరీక్షలకు చదువుకోవడానికి అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ బీడీసీలు చిన్న ,యాకూబ్ పాల్గొన్నారు.


బహుమతులు ప్రధానం చేస్తున్న వైసీపీ మండల కన్వీనర్ మల్లికార్జున

సప్లయర్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం


ఎగసి పడుతున్న మంటలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు పట్టణంలోని ఉమ సప్లయర్స్ దుకాణంలో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసరాల్లో నివాసం ఉంటున్న జనం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దుకాణంలో ఉన్న కుర్చీలు, డేరాలు, వంట పాత్రలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. దుకాణంలో 10 గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. అవి పేలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ బసన్న గౌడ్ పరిశీలించారు.

తీరు మారని ఏరియా ఆసుపత్రి

- ఇటీవల కలెక్టర్ ఆగ్రహించినా మార్పేది

- రోగులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - ఆదోని



ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులు పడుతున్న అవస్థలను కళ్లకు కట్టినట్లు వివరిస్తున్న డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ఉన్నత అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితిని పలువురు విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సృజన ఆస్పత్రిని తనిఖీ చేసి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడ ఉన్న పరిస్థితులు చూసి ఆమె కూడా చలించిపోయిన సందర్భాలు ఉన్నాయి. తరచుగా తనిఖీలు చేసి ఉద్యోగుల్లో మార్పు దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అయినా కొందరు వైద్యులు ప్రవేటు క్లినికులపై ఉన్న శ్రద్ధ డ్యూటీపై చూపడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్యం అందిస్తామని పాలకులు చెబుతున్నా.. ఆదోని ఏరియా ఆసుపత్రిలో మాత్రం అందుకు భిన్నంగా ఉందనే రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరంతో ఆసుపత్రికి వస్తే సామాన్య రోగులకు విశ్రాంతి తీసుకున్నందుకు కూడా అవకాశం లేకపోవడంతో నిల్చోలేక నేలపైన కూర్చుంటున్నారు రోగులు. ఆస్పత్రి ఆవరణంలో సేద దీరెందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఓపి రాయించుకునేందుకు బారులు తీరుతున్నారు. అసలే ఎండాకాలం కావడంతో ఉక్కుపోతకు వరు సలో నిలుచలేక కొందరు ఆయాస పడుతూ ఉంటున్నారు. ఆన్లైన్ సర్వర్ మొరాయిస్తుండడంతో మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా.. పట్టించుకునే వారే లేరు.

కర్నూలు రేఫర్ అంటున్న వైద్యులు: రోడ్ యాక్సిడెంట్లు,ఇరువర్గాల ఘర్షణ ఇతర ప్రమాదాల బారిన పడ్డ వారికి అరకొరగా ప్రాథమిక చికిత్స అందించి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. కర్నూలు ఆస్పత్రి 100 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో కోలుకోక కొందరు మార్గమధ్యలోనే మృత్యువాత పడుతున్న ఘటనలో ఉన్నాయి. మంచి ట్రీట్మెంట్ ఇస్తే కాపాడిన వారు అవుతారని పలువురు అంటున్నారు. ఆలూరు, హాలగుంద, కోసిగి, కౌతాళం, ఆస్పరి,పెద్దకడబురు ఇతర గ్రామాల వారు ఈ ఆసుపత్రికి వస్తూ ఉంటారు రోగుల సంఖ్య అనుగుణంగా వైద్య సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యము పేదలకు అందని ద్రాక్ష అని పలువురు చెబుతున్నారు.

పెంచేసిన ఓపిచార్జీలు: ఆదోనిలో ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ఓపి చార్జి అమాంతంగా పెంచారు. 100 నుండి 200 రూపాయలకు వసూలు చేస్తున్నారు. రోజు మరిచి రోజు రోగులు వెళ్లిన కొత్తగా ఓపి తీసుకోవాల్సి ఉంది. దీనికి తోడు ఇష్టానుసారంగా మందులు వ్రాయిస్తూ, ఎక్స్రే, స్కానింగ్, రక్త పరీక్ష అంటూ కనీసం రూ 2వేలకు తగ్గకుండా డబ్బు చెల్లించాల్సి వస్తుందని రోగులు చెబుతున్నారు. ఈ మొత్తం చెల్లించుకోలేక ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే అక్కడ కనీసం చూసేవారే కరవడంతో పేద రోగు లు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరము, తలనొప్పి శ్వాస సంబంధమైన రుగ్మతలను ఎదుర్కొంటున్న వారు అధికంగా వస్తున్నారు. కనీసం రోగాలు ఎదుర్కొంటున్న పరిస్థితులు సమస్యలు వినే వారే కరువయ్యారని వాపోతు న్నారు. ఆదోని పట్టణంలోనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల పరిస్థితి అధ్వానంగా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రభలతుండడంతో ప్రైవేట్ ఆస్పత్రులలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించుకోలేక సామాన్య రోగులు ప్రభుత్వ హాస్పిటల్ ను ఆశ్రయిస్తున్నారు. అక్కడ మెరుగైన వైద్యం దేవుడు ఎరుగు కానీ కనీసం సెలెన్ బాటిల్ కూడా స్వేచ్ఛగా ఎక్కించుకోలేని పరిస్థితులు ఉన్నాయని రోగులు వాపోతున్నారు.


ఓపి కోసం బారులు తీరిన రోగులు

ఓపి చీటికి అవస్థలు: ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోజుకు 300 మంది రోగులు ఓపికి వస్తున్నారు. అందులో ఆయాసం, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులు, ఇతర ప్రమాదాలు జరిగిన వారు వస్తూ ఉంటారు. ఓపి కౌంటర్లో వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి స్లిప్ చేతికిచ్చేలోపు సమయం పడుతుండడంతో వరుసలో నిలవలేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, పురుషులకు ఒకే కౌంటర్ ఉండడంతో వరుసలో నిల్చలేక సోమ్మసిల్లి పడిన సందర్భాలు ఉన్నాయని రోగులు వాపోతున్నారు. కనీసం మరొక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి నిర్వహకులకు కోరిన పట్టించుకునే వారే లేరని రోగులు మండిపడుతున్నారు.

పేరుకే 100 పడకలు : ఆదోని ఏరియా ఆసుపత్రి 100 పడకలుగా గుర్తింపు ఉంది అందుకు తగ్గట్టు సదుపాయాలు, వైద్యులు, నర్సులు,మందులు, ఇతర సిబ్బంది లేరని రోగులు చెబుతున్నారు. అరకొర డాక్టర్లు ఉన్నా కనీసం చేయి ముట్టి చూడని వైనం అంటూ కొందరు రోగులు ఆవేదన చెందుతున్నారు. తాము చెప్పిందే మాత్రమే వింటున్నారని పారాసిటిమల్, పెయిన్ కిల్లర్, సెలైన్ బాటిల్స్ మాత్రమే ఇస్తూ, మెరుగైన వైద్యము కనపడని పరిస్థితిని బహిరంగంగానే చెబుతున్నారు. పడకలు చాలక ఒకే మంచంపై ఇద్దరేసి పడుకోవడం వల్ల కనీసం పక్కకు కూడా తిరగలేని దుస్థితి నెలకొందని నరకం చూస్తున్నామని వాపోతున్నారు.



విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ

- ఇప్పటికే ప్రయివేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల పేరుతో కోట్లలో వ్యాపారం
- పట్టించుకునే నాథుడే కరువాయే..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రయివేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పోటీపడి మరి ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను లూటీ చేస్తున్నాయి. ప్రభుత్వం నుండి అనుమతులు రాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తూ ఇప్పటికే కోట్లలో ధనార్జన చేస్తున్నాయి. నర్సరీకే ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థికి రూ.30 వేల నుండి రూ.50 వేల వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికే పుస్తకాల పేరుతో కోట్ల రూపాయల వ్యాపారం చేశాయి. పాఠ్యపుస్తకాలు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో అమ్మకూడదని నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కుతున్నాయి. నర్సరీ, యూకేజీ, ఎల్‌కెజికి రూ.3 వేల నుండి రూ.5 వేల వరకు, 6, 7, 8, 9, 10వ తరగతులకు రూ. 7 వేల నుండి రూ.9 వరకు, అలాగే యూనిఫామ్, టై, బెల్ట్, షూ పేరుతో మరో రూ.4 వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఫీజులు కాకుండానే బుక్స్, యూనిఫామ్, టై, బెల్ట్, షూ కొరకు 10 వేల నుండి 15 వేల వరకు ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఇంత దోపిడీ జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలియాడుతున్నారు. విద్యాసంస్థల వైపు కన్నెత్తి చూడటానికే సాహసించడం లేదంటే ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖను ఎంత ప్రభావితం చేస్తున్నాయో అర్థమవుతోంది. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై ఆదాయ పన్నుల శాఖ ఎందుకు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక ఫీజులపై చర్యలు శూన్యం



ప్రయివేట్ పాఠశాలలు ఇష్టారాజ్యాంగ ఫీజులు వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఫీజులే కాకుండా పుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫాం లాంటి అంగటి సరకులు కూడా పాఠశాలల్లో అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇవన్నీ చూస్తూ ఉన్న మండల విద్యా శాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజాన్యం ఇచ్చే లంచాలకు పాల్పడి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేయాలి. అధికంగా వసూలు చేస్తే పాఠశాలల ఎదుట ప్రత్యక్ష ఆందోళనలు చేపడతాం.

నిరంజన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి.



డిపోలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డికి వివరిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ డిపో సెక్రటరీ ఐవిఆర్.రెడ్డి

డిపో సమస్యలు పరిష్కరిస్తాం

- ఏపి రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - డోన్

డోన్ డిపోలో ఆర్టీసీ కార్మికులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం డోన్ డిపోను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. బస్టాండ్, డిపో గ్యారేజీలో టైర్ సెక్షన్, ఎలక్ట్రికల్ సెక్షన్, వాషింగ్ ప్లాంట్‌లను ఆయన పరిశీలించారు. డిపోలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంప్లాయీస్ యూనియన్ డిపో సెక్రటరీ ఐవిఆర్.రెడ్డి డిపోకు సంబధించిన తిరుపతి సర్వీస్, నీటి కొళాయి సమస్య, గ్యారేజీలో వాషింగ్ ట్యాంక్, వాటర్ సంపుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. చైర్మన్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డిపిటిఒ శ్రీనివాసులు, డోన్ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్, ట్రాఫిక్ మెకానికల్ సూపర్వైజర్లు, సిబ్బంది, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఎన్‌ఎంయు నాయకులు పాల్గొన్నారు.

'శ్రీశైలం'కు పోటెత్తిన యాత్రికులు

- కిటకిటలాడిన ఆలయ దారులు - గదులు దొరకక ఇబ్బందులు పడ్డ భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకునేందుకు ఆదివారం యాత్రికులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తుల రద్దీ బాగా పెరిగింది. పాఠశాలలకు సెలవులు ముగుస్తుండడం, రాష్ట్రంలో ఎండలు తగ్గి చల్లబడడం, పరీక్షలు రాసిన కొన్ని ఫలితాలు వెల్లడి కావడంతో స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండి కాక పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుండి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి దర్శించుకుంటున్నారు, స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతోందని భక్తులకు తెలిపారు. భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిని ఇచ్చారు. భక్తులు అడిగినన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిగా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు, దేవస్థానం గదులు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి. ఇంకా అనేకమంది భక్తులు గదులు దొరకక ఇబ్బందులు పడ్డారు.

అన్నదానానికి విరాళం : శ్రీశైలం క్షేత్రంలోని అన్నదాన పథకానికి ఆదివారం దాత విరాళాన్ని అందజేశారు. కర్నూలుకు చెందిన ఎం శివ శంకర్ రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి 1 లక్ష 116 రూపాయలను విరాళంగా దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారికి అందజేశారు. దాతకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.



దర్శనం కోసం క్యూలో నిలబడిన భక్తులు

దళితులకు న్యాయం చేస్తాం

- ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్
- వేంపెంటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పాములపాడు

దళితులు ఎవరైనా అన్యాయం జరిగితే వారు ఒక్క ఫోన్ కాల్ చేస్తే తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చూస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేద్కం దేశంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉండేలా రాజ్యాంగం రాశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వారి ఆర్థిక పరిస్థితులు, స్థితిగతులను అధ్యయనం చేసి ముందుచూపుతో రిజర్వేషన్లు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగంలో పొందుపరిచారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి బి.నాగ లక్ష్మమ్మ, కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్, ఆత్మకూరు ఆర్డీవో దాసు, పాములపాడు తహశీల్దార్ రత్న రాధిక, ఏవో కర్ణ సాగర్, సిఐ సుబ్రమణ్యం, ఎస్సై జి.అశోక్, వివిధ సంఘాల నాయకులు ప్రముఖ డాక్టర్ నాగన్న, నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఘనంగా ఏరువాక పౌర్ణమి

- అరక పట్టిన ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల మండలం చాబోలు గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. పొలంలో రైతు సంఘం నాయకులు అరక పట్టి దుక్కి దున్నారు. అలాగే రైతులు తమ ఎద్దులను అలంకరించి అరకబట్టి దున్ని సేద్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ మాట్లడుతూ అనేక సంవత్సరాల నుండి గ్రామీణ ప్రాంతాల్లో రైతులందరూ కలిసికట్టుగా ఏరువాక పౌర్ణమి సందర్భంగా తమ వృషభాలను రంగులతో అలంకరించుకొని పొలాల్లో సేద్యాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. నైరుతి రుతుపవనాల వల్ల మంచి వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ప్రకృతిని కోరారు. ప్రకృతితో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం అభివృద్ధికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు సకాలంలో అందించి, పంటలు కల్లాల్లోకి రాకముందే మద్దతు ధరను ప్రకటించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రైతులందరూ రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండి అవసరమైన అన్ని రకాల హక్కులను సాధించుకునేందుకు సమిష్టిగా పోరాడాలని, అందుకు రైతు సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, జిల్లా నాయకులు ప్రసాద్, చాబోలు నాయకులు వెంకట లింగమయ, డి.బాల హుస్సేన్, నాయుడు, మురళి, మాజీ ఎంపిటిసి చిన్న బాల హుస్సేన్, రైతులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడు బంగ్లా మండల కేంద్రంలో ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొలంలో అరక పట్టారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నూతన ఆర్థిక విధానాల వలన రైతులపై ఎక్కడలేని బారాలు మోపుతున్నారని అన్నారు. రైతులకు సబ్సిడీ రుణాలు అందించడంలో, సున్నా వడ్డీ పథకం వర్తించడంలో ప్రచార ఆర్బాటం తప్ప అమలు శూన్యమన్నారు. సబ్సిడీపై విత్తనాలను, ఎరువులను, క్రిమిసంహారిక మందులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో (మిగతా 6వ పేజీలో..)



ఏరువాక సంబరాల్లో రైతు సంఘం నాయకులు



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న భూమా

గెలుపోటములు సహజం : భూమా

ప్రజాశక్తి - చాగలమర్రి

పోటీలలో గెలుపు, ఓటములు సహజమని తెలుగు యువత ఆళ్ళగడ్డ నియోజకవర్గ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలిపారు. ఆదివారం చాగలమర్రి పట్టణ శివారులోని హజరత్ దస్తగిరి స్వామి (కట్ట మీద స్వామి) ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న భూమాకు టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష, మౌళాలి, కొలిమి హుసేన్‌వళి, హనీఫ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు ఘన స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రత్యేక పాతేహాఃలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలను ప్రారంబించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 24 జతల వృషభాలు పాల్గొనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు ఉప్పు మహబూబ్ సాహెబ్, చక్రం బీడి షబ్బీర్, కొలిమి హుసేన్‌వళి, షరీఫ్, సుబ్బారెడ్డి, రియాజ్, హుసేన్‌షా వళి, దాదాపీర్, టిడిపి నాయకులు సల్లా నాగరాజు,గుత్తి నర్సింహులు, ముల్లా గఫార్, నాగూర్, ఖలీల్, జెట్టి నాగరాజు, కసినేని ఓబులేసు, మాబులాల్, టైలర్ ఖాధర్, కొలిమి మాబాష, సున్నీ, అబ్దుల్లా, భాస్కర్‌రెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుడు మృతి

- నివాళులర్పించిన మాజీ సర్పంచి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఇలియాజ్ బేగ్ (64) ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్‌లు అక్కడికి చేరుకుని ఇలియాజ్ బేగ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. వీరి వెంట టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, టిడిపి నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, ఖైదర్ అలీ, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

అక్రమార్కులపై బదిలీ వేటు

- నంద్యాల ఎఒ అవుకు మండలానికి.. - ఎడి బదిలీకి రంగం సిద్ధం..?
- తనిఖీలపై ఎరువులు, విత్తనాల డీలర్లకు ముందస్తు సమాచారంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖలో బదిలీల పేరుతో ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారు.. గత కొన్ని రోజులుగా వ్యవసాయ శాఖలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకున్న జిల్లా కలెక్టర్ అక్రమార్కులపై బదిలీ వేటుకు సిద్ధమౌతున్నారు. ఈ కోవలోనే నంద్యాల మండల వ్యవసాయ అధికారి స్వప్నకపై బదిలీ వేటు పడింది. జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా కొన్ని ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని ఎరువుల దుకాణాల డీలర్లు షాపులు మూసుకుని వెళ్లడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అందుకు కారణం వ్యవసాయ అధికారులే ముందస్తు సమాచారం ఇవ్వడం. దీంతోనే డీలర్లు షాపులు మూసుకొని వెళ్ళారనే సమాచారం రావడంతో జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల మండల వ్యవసాయ అధికారిణిని అవుకు ఏవోగా బదిలీ చేశారు. అవుకు ఏవో ప్రసాదరావును నంద్యాలకు బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో స్వప్నిక పేరు లేదు. ఆమె జిల్లాకు వచ్చి ఏడాది కూడా కాలేదు.. కేవలం శనివారం జరిగిన కలెక్టర్ ఆకస్మిక తనిఖీనే కారణమనే చర్చ జరుగుతుంది. మే 31న బదిలీ చేసినట్లు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా అనేక ఏళ్ల నుండి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న నంద్యాల ఏడిపైన కూడా బదిలీ వేటు పడే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే కలెక్టర్ తనిఖీల్లో భాగంగా మూసివేసిన ఎరువుల దుకాణాల డీలర్లపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో విత్తనాల దుకాణాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల ఏజెన్సీల డీలర్లలో భయం పట్టుకుంది.. ఎక్కువ శాతం డీలర్లు తమ షాపుల్లో ఎక్కడ కూడా స్టాక్ వివరాలు, ధరల వివరాలు స్టాక్ బోర్డులలో పొందుపరచిన దాఖలాలు లేవు.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు అమ్మకాలపై, బ్లాక్ మార్కెట్‌పై కలెక్టర్ దృష్టి సారించారు. జిల్లా కేంద్రంగా బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్మితే అలాంటి ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామని, కంపెనీలను సీజ్ చేయడానికి సైతం వెనకాడబోమని కలెక్టర్ హెచ్చరించారు.

రూ.10 కోట్లతో ఉడాయించిన వ్యాపారి

- ఆందోళనలో రైతులు, వ్యాపారులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని గాంధీ సెంటరులో గత 40 సంవత్సరాలుగా నడిపిస్తున్న శ్రీరామ ట్రేడింగ్ ఎరువుల దుకాణం యజమాని వంకధార సుబ్బారావు రైతులు, వ్యాపారుల నుంచి దాదాపు రూ.10కోట్ల వరకు అప్పు రూపంలో తీసుకుని ఉడాయించారు. గత కొద్ది రోజులుగా దుకాణం. మూసేసి బాధితుల ఫోన్లు ఎత్తకపోవడంతో ఆదివారం పట్టణంలోని పాతబస్టాండు ఆవరణలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చాగలమర్రి మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది దాకా దాదాపు రూ.10 కోట్లు మేర అప్పులిచ్చారు. అప్పులు తీసుకుని ఉడాయించి హైదరాబాదులో రియలేస్టేట్ వ్యాపారం చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఇప్పటికే స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశామని, త్వరలో కలెక్టరు, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



పాతబస్టాండులో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

మహానందిలో 'బలగం' నటుడు ప్రసాద్

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రాన్ని బలగం చిత్రం నటుడు ఎస్‌ఆర్‌ఎస్ ప్రసాద్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారు స్వామి అమ్మవార్లను దర్శించుకని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కళలు సమాజ చైతన్యానికి ప్రతీకలని అన్నారు. తాను నంద్యాల వాసినేనని అన్నారు. 40 ఏళ్లుగా సాంఘిక నాటకాల ప్రదర్శనలను చేస్తుండడం వల్ల సినిమాల్లో, ధారావాహికల్లో అవకాశాలు లభించాయని తెలిపారు. మన దేశంతో పాటు కువైట్‌లోనూ ప్రదర్శనలను చేసినట్లు చెప్పారు. ఇటీవల ఎంతగానో ప్రేక్షకుల ఆదరణ పొందిన బలగం సినిమాలో మంచి అవకాశం రావడంతో తనను బలగం ప్రసాద్ అని పిలుస్తున్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రముఖ హీరో



బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి చిత్రంలో పూజారిగా చక్కటి వేషం దొరికిందని పేర్కొన్నారు. నందమూరి జయకష్ణ కుమారుడు చైతన్య కృష్ణ హీరోగా చేస్తున్న బ్రీత్ సినిమాలో హీరోకు మేనమామగా నటిస్తున్నట్లు తెలిపారు. ఇది త్వరలో రిలీజ్ అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 43 సినిమాల్లో, 10 ధారావాహికల్లో, రెండు వెబ్ సిరీస్‌లలో నటించినట్లు తెలిపారు. విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమాల్లో భరతనాట్యం, ఖుషి, బైరాన్ పల్లి, జై అమరావతి ఇంకా పేర్లు ఖరారు కానీ ఆరు సినిమాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. అలాగే రంగులరాట్నం, దేవతలారా దీవించండి, సూర్యకాంతం, రాధమ్మ కూతురు వంటి ధారావాహికల్లో నటిస్తున్నట్లు వివరించారు. నాటక రంగంలో ఇప్పటికే 250 పైగా ఉత్తమ నటుడు బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. తాను ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తూనే నాటకాల పట్ల మక్కువతో నటిస్తున్నట్లు చెప్పారు. నంద్యాలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ గుర్రాల రవికృష్ణల సారధ్యంలో కళారాధ సంస్థను నెలకొల్పి ఎన్నో చైతన్య కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు చేసి ప్రజల చేత ప్రశంసలు పొందినట్లు పేర్కొన్నారు. సాంఘిక నాటక రంగంలో బళ్లారి రాఘవకు నంది అవార్డులను అందుకున్నట్లు వివరించారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయంలో రూ. 29 లక్షలతో చేపడుతున్న ల్యాండ్ స్కేప్, ఇంటర్నల్ రోడ్డు, వాకింగ్ ట్రాక్ పనులను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో నూతన మున్సిపల్ కార్యాలయంను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్ రెడ్డి, కటిక వేణు, సచివాలయల కన్వీనర్ కురుకుంద హరి, కాంట్రాక్టర్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి పి.సుభాన్ తెలిపారు. ఆదివారం పగిడ్యాల ఆదర్శ పాఠశాల నుంచి పుస్తకాలను ఆటో ఆయా ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. 1 నుంచి 10వ తరగతి వరకు 23 వేల పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. 3503 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున యూనిఫాం, 2181 మంది విద్యార్థులకు బెల్టులు మంజూరయ్యాయని చెప్పారు. విక్టోరియా 196 డిక్షనరీలు, 388 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా దాదాపు 8 వేల పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు. పుస్తకాలు కూడా త్వరలోనే వస్తాయన్నారు. ఈ నెల 10వ తేదీ లోపల అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్టులు అందించేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఐఎస్, డిటిపి, ఐఈఆర్‌టి, పిఆర్‌టిలు పాల్గొన్నారు.





పూజలు నిర్వహిస్తున్న పూజారులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని జోలాపురంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మారెమ్మ, కుంటెమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ట మహెూత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. నూతనంగా నిర్మించిన దేవస్థానంలో వేద పండితులు విశేషె పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. చెక్క భజన ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కతాల తిరుపాల్, విఆర్ఒ నారాయణరెడ్డి, ఉప్పు ప్రతాపరెడ్డి, గంధం హుసేని, పల్లె తిరుపతయ్య, వీరయ్య ఆచారి, బిల్లా వెంకటేశ్వర్లు, బాల తిమ్మయ్య, బ్రహ్మయ్య ఆచారి, శ్రీపతి నారాయణ, గుడిపాటి తిమ్మారెడ్డి, తలారి తిరుమలయ్య, బిల్లా రామకృష్ణ, గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం పెంపు

ప్రజాశక్తి - బనగానపల్లె

కరాటే సాధన ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని డాల్ఫిన్ స్కూల్ కరస్పాండెంట్ జలదుర్గం సికిందర్ భాష, ఏపీ అకాడమీ డైరెక్టర్ ఫయాజ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని డాల్ఫిన్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్రౌన్ బెల్ట్ సాధించారు. విద్యార్థులకు కరస్పాండెంట్ జలదుర్గం సికిందర్ భాష బెల్టులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని, ఆత్మ రక్షణకు ఎంతో అవసరమన్నారు. అకాడమీ తరపున విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని, అంతర్జాతీయ స్థాయి వరకు తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ చంద్ర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ర్యాంప్ తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పాములపాడు : పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామ సరిహద్దులో ఉన్న తెలుగు గంగ కాల్వపై ఉన్న పాత ర్యాంప్‌ని తొలగింపు గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. తుమ్మలూరు గ్రామం మత్స్యకారులు, పశువుల కాపరుల సమాచారం మేరకు హుటాహుటిన వైసిపి మండల నాయకులు రామలింగేశ్వర రెడ్డి, తుమ్మలూరు గ్రామ సర్పంచ్ ప్రసాద్ రావు, గ్రామ పెద్దలు వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు కలిసి వెళ్లి విఏఎం కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ హుస్సేన్‌ను అక్కడికి పిలిపించారు. ఈ ర్యాంప్ తొలగించరాదని, తొలగిస్తే చాలా మంది ఉపాధిని కోల్పోతారని తెలిపారు. కావాలంటే ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌తో మాట్లాడతామని, నూతన ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని వారిని కోరారు.



అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఖరీఫ్‌కు రైతన్న సిద్ధం

- దుక్కి పనుల్లో నిమగ్నం

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. మే నెలలో కురిసిన వర్షాల కారణంగా రైతులు తమ పొలాలను విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ముందుగానే వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు వేసుకోవచ్చన్న ఆశతో రైతులు తమ పొలాల్లో గతంలో వేసిన పంటల వ్యర్థాలను తొలగించుకుని అంతా సిద్ధం చేసుకుంటున్నారు. కొత్తపల్లి మండలంలో సుమారు 20 వేల ఎకరాల సాధారణ సాగు భూమి ఉంది. అయితే దాదాపు రైతులు 17.5 వేల ఎకరాల పొలాలను సాగు కోసం సిద్ధం చేసుకున్నారు. తొలకరి చినుకులు కురిసిన వెంటనే విత్తనాలు వేసేందుకు అన్ని రకాలుగా పనులను పూర్తి చేసుకున్నారు. రైతులు వేస్తున్న పంటలను అధికంగా దిగుబడి ఇవ్వాలన్న సంకల్పంతో పశువుల పేడ పొలాల్లో తోలుకొని చల్లుకుంటున్నారు. ఎండాకాలంలో రైతులు వ్యవసాయ పనులు లేక గ్రామాల్లో ఉన్న అరుగులు, చెట్ల కింద రోజంతా కాలయాపన చేస్తూ గడిపారు. మే నెలలో కురిసిన వర్షాల కారణంగా ఆ నెల చివరి నుంచి జూన్ ప్రారంభంలో రైతులు వ్యవసాయ పొలాల్లో పనుల్లో నిమగ్నం అయ్యారు. కొత్తపల్లి మండలంలో ఎక్కువ శాతం రైతన్నలు వర్షాలపై ఆధారపడి పంటలు పండించుకుంటున్న పరిస్థితి నెలకొంది. పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, శివపురం, లింగాపురం గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పత్తి, మిరప, కంది వంటి పంటలు సాగు చేస్తారు. కొత్తపల్లి, గువ్వలకుంట్ల, వీరాపురం, బండి నాయిని పాలెం, పాలెం చెరువు గ్రామాల్లో వర్షాధారం, కుంటలు, చెరువులపై ఆధారపడి అధికంగా వరి సాగు చేస్తారు. అయితే కొత్తపల్లి మండలంలో ఉన్న ముసలమడుగు గ్రామ శివారులో రెండు ఎత్తిపోతల పథకాలు శివపురం, సంగమేశ్వరం ఉన్నాయి. కానీ నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా మారాయి.



వర్షాలు పడిన వెంటనే విత్తనాలు వేయండి



గ్రామాల్లో ఉన్న రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వర్షాలు పడిన వెంటనే విత్తనాలు వేయాలి. ముందుగానే రైతులు తమ పొలాలను అన్ని రకాలుగా సిద్ధం చేసుకోవాలి. పంటలు వేసినప్పటి నుంచి వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి. పంట మార్పిడి చేసుకోవడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చు.

- మండల వ్యవసాయ అధికారి మహేష్.

రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి. కల్తీ విత్తనాలను వ్యవసాయ అధికారులు ముందుగానే పసిగట్టి అరికట్టాలి. కల్తీ విత్తనాల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి. రైతన్నలకు గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం నుంచి అందిస్తున్న విత్తనాలను ప్రతి రైతుకూ అందేలా చూడాలి. విత్తనాలను ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్మకుండా ప్రభుత్వం నేరుగా ఆర్‌బికెల ద్వారా అందించాలి.

- రైతు సంఘం జిల్లా నాయకులు సంజీవ రాయుడు.



రొట్టె, పప్పు, గుడ్డు అందజేస్తున్న జాన ప్రభాకర్

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - డోన్ : డోన్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గర్భవతులకు, బాలింతలకు, రోగులకు ప్రార్థన సమయం ఆధ్వర్యంలో 57వ సారి శ్రీ రాధాకృష్ణ స్వీట్ షాప్ వారి ఆర్థిక సహాయంతో రొట్టె, పప్పు, గుడ్డు పౌష్టికాహారాన్ని జాన ప్రభాకర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానప్రభాకర్ మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో సుదీర్ఘంగా కొనసాగుతున్న రొట్టె, పప్పు, గుడ్డు కార్యక్రమం మంచి గుర్తింపుగా ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ కార్యక్రమం మంచి ఊరటనిస్తుందని తీసుకున్న ప్రతి ఒక్కరు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దాతలు సహాయ సహకారాలు అందిస్తే అనేక కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో 47 మంది నిరుపేదలకు కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి ఆదివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల 36వ వార్డులో ఇల్లు లేని పేదవారికి వారికి సొంతింటి కలను నెరవేస్తూ 47 మందికి నేడు పట్టాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావళి, వైసిపి నాయకులు జయప్రకాశ్, మహిళా బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోస్టుల బ్లాక్‌తో తీవ్ర నష్టం : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో పోస్టులు అన్ని ఖాళీలు చూపకుండా 50 శాతం ఎస్‌జిటి పోస్టులను అలాగే ఎస్ఏ తెలుగు, హిందీ, పీడీ పోస్టులు బ్లాక్ చేయడం వల్ల ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతోందని, వెబ్ కౌన్సిలింగ్ కాకుండా మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నాగమణి, నంద్యాల జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పివి ప్రసాద్, జె.సుధాకర్ డిమాండ్ చేశారు. నంద్యాలలో యుటిఎఫ్ ఆఫీస్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలోనే యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు జరపడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అయ్యారని అన్నారు. ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఎస్‌జిటి పోస్టులు ప్రతి మండలంలో 30 నుంచి 40 శాతం బ్లాక్ చేశారని ఈ విధంగా బ్లాక్ చేయడం వల్ల 25 నుంచి 30 సంవత్సరాలు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు కూడా దూర ప్రాంతాలలో పని చేయవలసి వస్తుందని అన్నారు. విద్యా శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు జాకీర్ హుస్సేన్, కె.రామకృష్ణుడు, పిసిహెచ్. బాలస్వామి, వివి.రామ మోహన్, శ్రావణ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి హయాంలో అనర్హులకు పథకాలు

- మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

గత టిడిపి ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలన్నీ జన్మభూమి కమిటీల ఆమోదంతో అనర్హులైన టిడిపి కార్యకర్తలకు అందజేశారని, వైసిపి ప్రభుత్వం అర్హులకు మాత్రమే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. అయన ఆదివారం మండల అధ్యక్షుడు రామిశెట్టి వీరభద్రుడు తన స్వగ్రామమైన తోడేండ్ల పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి మొక్కుబడి కార్యక్రమం సంద ర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయనకు వీరభద్రుడు కుటంబ సభ్యులతో కలిసి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. గతంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. మళ్లీ అబద్దపు మ్యానిఫేస్టోను ఎవ్వరు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, ఆళ్ళగడ్డ నాయకులు గోట్లూరు సుధాకరరెడ్డి, నరసింహారెడ్డి, మనోహార్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మండల నాయకులు రామిశెట్టి బలరాముడు, సర్పంచ్ గోవిందయ్య, రామిశెట్టి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ షేక్ సాహెల్, ముల్లా ఖాదర్ బాష, మండ ల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, మాజీ జడ్పిటిసి టి. రామగురివి రెడ్డి,లక్ష్మిరెడ్డి,అంకాల్‌రెడ్డి, మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు వినూత్న తరహాలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారు లందరూ హాజరుకావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలపై సిపిఐ హర్షం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కల్తీ విత్తనాలను, ఎరువులను అరికట్టేందుకు జిల్లాలో ఎరువుల విత్తనాల షాపులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆకస్మిక తనిఖీలు చేయడం పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఆదివారం ఒక ప్రకటన హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో అధికార పార్టీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి నకిలీ విత్తనాల ముఠాకు నాయకత్వం వహించడం దుర్మార్గమని, పార్టీలకు అతీతంగా రైతులకు నష్టం కలిగించే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.

7లోపు వైఎస్ఆర్ బీమా నమోదు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈనెల 7వ తేదీలోపు వైఎస్ఆర్ బీమాను నమోదు చేసుకోవాలని వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 నుంచి 70 సంవత్సరాలలోపు వారు వైఎస్ఆర్ బీమాను నమోదు చేసుకోవాలన్నారు. వైయస్సార్ నమోదు చేసుకోవడం వలన ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సహజంగా మరణిస్తే రూ.1 లక్ష బీమా సదుపాయం లభిస్తుందన్నారు. వైఎస్ఆర్ బీమా నమోదు వాలంటీర్ల వద్ద ఉచితంగా నమోదు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆలమూరు-చిత్రేనిపల్లి గ్రామాల మధ్య ఆదివారం రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చిత్రేనిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు(52) మోటార్ సైకిల్‌పై ఆలమూరు నుంచి గ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం రుద్రవరం 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు ఓబులేసు, కుమార్తె చెన్నమ్మ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - మహానంది

రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మహానంది మండలం బోయిలకుంట్ల మెట్ట వద్ద నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కారు, అదే సమయంలో బోయిలకుంట్ల గ్రామం నుంచి నంద్యాల వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ కుమారస్వామికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. మహానంది పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆళ్లగడ్డ : పూర్వ విద్యార్థులు కలిసిన దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక లింగందిన్నె రోడ్డులో ఉన్న ఇరిగెల గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనానికి వంద మంది పైగా స్నేహితులు హాజరై ఆత్మీయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులలో పలువురు న్యాయవాదులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలలో స్థిరపడిన వ్యాపారులు ఉన్నారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ కలుసుకొని ఆట పాటలతో సరదాగా గడిపారు. వైపీపీఎం పాఠశాల పూర్వ విద్యార్థి ఇరిగెల ప్రతాప్ రెడ్డి, సయ్యద్‌లు మాట్లాడుతూ తమ బ్యాచ్‌లో చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన స్నేహితులందరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమ్మేళనంలో న్యాయవాది సేపూరి విజయ మోహన్, కోటేశ్వరరావు, పుల్లా రెడ్డి, చంద్ర, పురోహితులు వారణాసి ప్రసాద్ శర్మ, కాశీంవలి, సత్యం, చాటకొండ సురేష్, మహబూబ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలోని పద్మావతి హైస్కూల్‌కి చెందిన 1996-97 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో ఘనంగా జరిగింది. నాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకుని పాఠశాల ఆవరణంలో సంచరిస్తూ సరదాగా గడిపారు. పద్మావతి హైస్కూల్ డైరెక్టర్ ఆశ ఆధ్వర్యంలో నాటి ఉపాధ్యాయులు సూర్యనారాయణ, మోహన్, రామారావు, సుదర్శన్, గౌస్ తదితరులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వపు విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రకటించారు.



ఆత్మకూరు : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మాజీ ఎమ్మెల్యే బుడ్డా ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న దృశ్యం

టిడిపిలోకి 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : మండలంలోని పార్నపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుల్లెట్ రాఘవరెడ్డి, కాశీ పేట మురళీమోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం చేరాయి. టిడిపిలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు బుల్లెట్ రాఘవరెడ్డి, మురళీమోహన్ రెడ్డిలు గ్రామంలో తమకు అండగా ఉంటారని, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో పని చేయుటకు నిశ్చయించుకున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ల కన్నా పుస్తకాలే మిన్న

ప్రజాశక్తి - పగిడ్యాల : సెల్‌ఫోన్ల కన్నా పుస్తకాలు మిన్న అని గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. ఆదివారం పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్లు వినియోగించడం వలన మానసిక అనారోగ్యానికి గురవుతారని అన్నారు. సెల్‌ఫోన్లు బదులు మంచి పుస్తకాలను పిల్లల చేత చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలోని గ్రంథాలయ అధికారిగా పని చేస్తున్న కౌసల్య నన్నూరు గ్రంథాలయలకు బదిలీ అయ్యారు. కొత్తపల్లిలో ఉన్న గ్రంథాలయంలో అధికారి కౌసల్య ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రంథాలయంలో లభించే న్యూస్ పేపర్లు, కథల పుస్తకాలు, ఆటల పోటీల్లో పాల్గొన్నారని ఆమె తెలిపారు.

హ్యాట్రిక్ విజయానికి సైనికుల్లా పని చేయాలి

- ఆర్థిక మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులను కోరారు. ఆదివారం బేతంచెర్లలోని వైసిపి కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన చట్టాలను అమలు చేయాలన్నారు. పంట నష్ట బీమా చెల్లించాలన్నారు. రైతులతో సంబంధం లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని తెలిపారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అకాల వర్షాలకు, ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయినప్పుడు నష్టపరిహారం కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజు, కౌలు రైతు సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.



కౌలు రైతులు సంఘం వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ప్యాపిలికి సిఎం వ్యక్తిగత పిఎ

ప్రజాశక్తి - ప్యాపిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత పిఏ రవిశేఖర్ యాదవ్ ఆదివారం ప్యాపిలికి వచ్చారు. పట్టణంలో వైసిపి నాయకుడు కొండయ్య ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, సర్పంచి లక్ష్మిదేవి, ఉప సర్పంచి భువనేశ్వర్ రెడ్డి, ప్యాపిలి సొసైటీ చైర్మన్ బోరెడ్డి రాము, సచివాలయ కన్వీనర్ బోర మల్లికార్జున రెడ్డి, హుస్సేనాపురం సొసైటీ చైర్మన్ బాలయ్య, కోటయ్య, ప్రభాకర్ రెడ్డి, నిజాముద్దీన్, ఉమేష్ యాదవ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్ : పాఠశాలలు ప్రారంభించకముందే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ డివో సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను, యూనిఫాం, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు 5066 బాలురకు, 1970 బాలికలకు యూనిఫామ్, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు మంజూరయ్యాయని తెలిపారు. మిగతావి ఈ నెల 12వ తేదీ లోపల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప రాణి, సిఆర్పిలు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



నందికొట్కూరు : ఏరువాక సంబరాల్లో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

(5వ పేజీ తరువాయి..) రైతు సంఘం జిల్లా నాయకులు వి.రామకృష్ణ, మండల నాయకులు ఎం హరి నాయుడు, వి.ఏసన్న, వడ్డే శివమణి, ప్రసాద్, జంగాల సుంకన్న, భాష, సిఐటియు మండల నాయకులు టి నరసింహులు, జి రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రైతులకు న్యాయం : గౌరు వెంకటరెడ్డి

పాములపాడు : టిడిపితోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గౌర వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం పాములపాడులో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులతో కలిసి నాయకులు ఏరువాకను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు టిడిపి ప్రభుత్వ హయాంలో గిట్టుబాటు ధర, పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి, సున్నా వడ్డీ ఇచ్చి అనేక విధాలుగా ఆదుకొని తొలకరిలో వచ్చే ఏరువాక పౌర్ణమిని రైతుల పండుగగా జరుపుకునేదని తెలిపారు. రైతన్న బాగుండాలని కోరుకుంటూ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ పార్టీ పరిశీలకులు దేవెళ్ళ మురళి, మండల అధ్యక్షులు చెల్లె హరినాథ్ రెడ్డి, నియోజక వర్గ అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజర్ సెక్రెటరీ జయసూర్య, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు జాకీర్, నాయకులు శివశంకర స్వామి, అబ్దుల్ ఆఫీస్, రాము చౌదరి, మైనారిటీ సెల్ కార్యదర్శి బషీర్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** రైతు అరుకాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని, రైతు సంక్షేమానికి నిధి ఏర్పాటు చేయాలని టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు గ్రామంలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు నాయకులతో కలిసి ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి పట్టారు.





మహారాజశ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.పి.నెం.14/2023

ఎం.రామచంద్రుడు. ...అర్జీదారు

-ఎదురి-

జయమ్మ వగైరా. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీస్

నంద్యాల జిల్లా, బేతంచెర్ల గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబరు ఐ.పి లో అర్జీదారు అయిన ఎం. రామచంద్రుడు తండ్రి ఎం. నాగేంద్ర, వ్యాపారము, ఇంటి. నెంబరు. 23-212-9, హనుమాన్ నగర్, బేతంచెర్ల గ్రామం, మరియు మండలం నంద్యాల జిల్లా అను నతడు తనను దివాళ దారుగా తీర్మానించమని కోరుతూ పైకోర్టులో దివాళ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా ఏమైనా ఆక్షేపం ఉన్న 30-6- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేది 30-6-2023

పి.వి.ఎస్. రామ ప్రసాద్,
ఆర్. మంజుల దేవి,
అర్జీదారు పరం న్యాయవాదులు, ఆత్మకూరు.

మహారాజశ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.88/2023

జి.మహేశ్వర రెడ్డి వగైరా. ...అర్జీదారులు

- ఎదురి -

కె.ఖాదర్ వలీ వగైరా. ...రెస్పాండెంట్లు నెం.1,3

1 మరియు 3 రెస్పాండెంట్లకు నోటీసులు

1. కె.ఖాదర్ వలీ తండ్రి కె.మాబు భాష, లారీ ఓనరు బేరింగ్ నెంబరు. ఏ.పి.39 యు 4679, ఇంటి. నెంబరు. 17-107-50-6, అక్కిరాజు కాలనీ, ఆత్మకూరు టౌన్, కర్నూలు జిల్లా.
ఎం. బాలకృష్ణ గౌడ్ తండ్రి ఎం.శంకరయ్య గౌడ్, లారీ డ్రైవర్, బేరింగ్ నెంబర్ ఏ.పి.39 యు 4679,ఇంటి నెంబర్. 2-101, తరిగోపుల గ్రామం, జూపాడుబంగ్లా మండలం, నంద్యాల జిల్లా.

పై నంబరు యం. వి. ఓ. పి లో గొంగటి లక్ష్మీదేవి 16-10-2022వ తేదిన రోడ్డు ప్రమాదంలో చని పోయినదని ఆమెకు నష్టపరిహారం రూ.10,00,000/- లు ఇందుపైన అర్జీ తేదీ నుండి 12% ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పైకోర్టులో అర్జీదాఖలు చేసినారు. ఇందులో 1,3 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న తేదీ 12-06-2023వ తేదీ పగలు 10:30 గంటలకు వాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పై కేసును విచారించి తీర్మానించ బడునని తెలియజే యడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 12-06-2023

బి. నాగేంద్రనాథ్ రెడ్డి,
అర్జీదారుల పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.852/2022

అబ్బాస్ అలీ వగైరా. ...వాదులు

-ఎదురి-

వి.హరికేశవ వగైరా. ...ప్రతివాదులు

2,3,5,6,7 ప్రతివాదులకు దావా సమన్లు

(2).వి.లక్ష్మీకాంత్ తండ్రి లేటు వి చక్రవర్తి, వ్యాపారం, ఇంటి.నెం.2-68-1,అప్పలావువీధి, ఆత్మకూరు గ్రామం, నంద్యాల జిల్లా.
(3).వి.విజేయుడు తండ్రి లేటు వి చక్రవర్తి,వ్యాపారం, ఇంటి.నెం.2-68-1, అప్పలావువీధి, ఆత్మకూరు గ్రామం, నంద్యాల జిల్లా.
(5). యస్.రాజశేఖర్ తండ్రి నరసింహయ్య, వ్యాపారం, ఇంటి.నెం.4-311,యం.హెచ్.స్కూల్ రోడ్డు, నంద్యాల టౌన్ మరియు జిల్లా.
(6).పి.వేణుగోపాల్ రెడ్డి తండ్రి శేషిరెడ్డి, వ్యావసాయం, గువ్వలకుంట గ్రామం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లా.
(7).మల్లికార్జున రెడ్డి తండ్రి యం.రామక్రిష్ణ రెడ్డి, బానకచర్ల గ్రామం, పాములపాడు మండలం, నంద్యాల జిల్లా.

పై నంబరు దావాలో వాదులు దావా షెడ్యూలు ఆస్తిపైన ప్రతివాదులు గానీ వారి తరపున మనుష్యులు గానీ ప్రవేశించకుండా పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని మరియు వాదులకు ఎలాంటి అభద్రత కలగకుండా (2) దావా ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖాలు చేసినారు. ఇందులో 2,3,5,6,7 వ ప్రతివాదులు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 21-6-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు:-

The land of Sy.No.154 to an Extent of AC.2.84 Cents situated within the village limits of Joharapuram village of Kurnool mandal,Registration and Sub-Registration District Kurnool.

Boundaries as follows:

East : Remaining Land in same SY.No.
West : Remaining Land in same SY.No.
North : Land of Devaraj.
South : Remaining Land in same SY.No.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 21-06-2023

యస్.యం.డి.హనీఫ్,
షేక్.షఫీ,
వాదులు పరం న్యాయవాదులు, కర్నూలు.